పేరులో ఆదర్శం.. వసతులు అధ్వానం

1990కు ముందు భీమిలి మున్సిపాలిటీ పరిధి నంతపేట, నంగివల, నమ్మివానిపేట గ్రామాల మధ్య సువిశాల ప్రాంతంలో మెట్ట పంటలు సాగయ్యేవి. అప్పుడే రియల్ ఎస్టేట్ మొదలయింది. సెంటు రూ.500 నుంచి రూ.1000(గజం రూ.10 – రూ.20) మధ్య కొనుక్కుని భీమిలి పరిసర ప్రాంతాల ప్రజలు ఇళ్లు నిర్మించుకున్నారు. అలా ఏర్పడిన గ్రామానికే ఆదర్శనగర్ అని పేరుపెట్టుకున్నారు. మూడున్నర దశాబ్దాలుగా ఈ గ్రామం కనీస వసతులకు దూరంగానే ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి కూడా కూటమి రాకతో మధ్యలోనే నిలిచిపోయింది.

- 35 ఏళ్లుగా వసతులకు దూరంగా ఆదర్శనగర్
- డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు కాక గ్రామస్తుల ఇబ్బందులు
- గత ప్రభుత్వంలో రూ.52 లక్షలతో పనులు ప్రారంభం
- కూటమి ప్రభుత్వం వచ్చాక పట్టించుకోని వైనం


ఆదర్శనగర్ మధ్యలో నిలిచిన మురుగు


నమ్మివానిపేట రోడ్డు వద్ద నిలిచిన మురుగు


పారిశుధ్య నిర్వహణ లేని డ్రైనేజీ


రోడ్డు, డ్రైనేజీ లేని ఆదర్శనగర్‌లోని ఓ వీధి

తగరపువలస: భీమిలి పరిధి ఆదర్శనగర్ ఏళ్ల తరబడి కనీస వసతులకు నోచుకోలేదు. పూర్తి స్థాయిలో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే నీటి ముంపు తప్పనిసరి. మిగిలిన సమయాల్లో డ్రైనేజీ మురుగు దుర్వాసనతో నానా యాతన పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.52 లక్షలు వెచ్చించి సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేపట్టారు. అది కూడా పార్టులుగానే జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి మాట దేవుడెరుక.. కనీసం పారిశుధ్య నిర్వహణకు కూడా నోచుకోని దుస్థితి.

పేరు గొప్ప..ఊరు దిబ్బ..

ఆదర్శనగర్ పేరైతే పెట్టుకున్నారు కాని 35 ఏళ్లుగా ఈ గ్రామంలో వసతులు లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. భీమిలి మున్సిపాల్టీ తరువాత ఆదర్శనగర్ జీవీఎంసీలో విలీనం అయింది. ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో రహదారులు లేవు. డ్రైనేజీలు కూడా లేకపోడంతో పాటు పారిశుధ్య నిర్వహణ ఊసేలేదు. చాలా వరకు ఇళ్ల నిర్మాణాలు ఇరుకుగా చేపట్టడంతో చెత్త తరలించే వాహనం నుంచి రేషన్ బండి, అంబులెన్స్, అగ్నిమాపక శకటం, ట్రాక్టర్ ఏవీ ఈ గ్రామంలోకి సులభంగా ప్రవేశించలేవు. గ్రామానికి ఉన్న పేరును చెడగొట్టేలా నివాసాల మధ్య ఎక్కడ పడితే అక్కడ మురుగు, అందులో సంచరించే పందులు, ఈగలు, దోమలు వీధివీధినా కాళ్ల మధ్య తిరుగాడే పదుల సంఖ్యలో కుక్కలను చూస్తే పేరు గొప్ప ఊరు దిబ్బ అనిపించక మానదు.

గత ప్రభుత్వంలో అభివృద్ధి జాడలు

గ్రామం ఏర్పడిన తర్వాత గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే అంతో ఇంతో అభివృద్ధిని గ్రామస్తులు చూశారు. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి తొలి విడత ప్రాధాన్యతిచ్చారు. ప్రభుత్వం మారిపోవడంతో ప్రాధాన్యతలూ మారాయి. దీంతో లెక్కలేనన్ని సార్లు స్థానికులు వసతుల కోసం వినతులు పట్టుకుని భీమిలి జోనల్ కార్యాలయం, జీవీఎంసీ ప్రధానకార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేసినా లాభం లేకుండా పోయింది. మురికి కూపాలుగా మారిన వీధుల నుంచి ఉపశమనం కలిగించేలా చూడాలని కనిపించిన ప్రజాప్రతినిధులందరినీ వేడుకుంటూనే ఉన్నారు.

గత ప్రభుత్వంలో కొన్ని పనులు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.52 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. అంతకు ముందు ఆదర్శనగర్ ఇంకా అధ్వానంగా ఉండేది. ఇప్పుడు కొంచెం నయం. పూర్తి వసతులు కల్పించాలి.
– డబ్బీరు ప్రశాంతి

వర్షం వస్తే ముంపులోనే..



వర్షాకాలంలో ఆదర్శనగర్ ముంపులో ఉంటుంది. సరైన డ్రైనేజీ వ్యవస్థ ఇక్కడ లేదు. కనీసం ఇళ్ల నుంచి వాడుక నీరు కూడా బయటకు వెళ్లదు. ఇళ్ల మధ్య దుర్వాసన కారణంగా ఇక్కడ అడుగు పెట్టలేం.
– మద్ది మహాలక్ష్మి

అసంపూర్తి వసతులు



బయట నుంచి ఆదర్శనగర్‌కు, అక్కడి నుంచి బయటకు వచ్చే మార్గాలన్నీ అసంపూర్తిగా ఉన్నాయి. వేటినీ పూర్తి చేయలేదు. సీసీ రోడ్ల కంటే ముందుగా పటిష్టమైన డ్రైనేజీ వ్యవస్థ నిర్మించాలి.
– చేట్ల నరసింగరెడ్డి

క్లుప్తంగా

ఇస్కాన్‌లో మార్మోగిన హరినామస్మరణ


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: హరేకృష్ణ.. హరేరామ అంటూ సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరం ఆదివారం మార్మోగింది. వారాంతపు పూజల సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షులు సాంబాదాస్ ప్రభుజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలను, పలు ప్రవచనాలు ఆలపించారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

250 మందికి వైద్య సేవలు


శిబిరంలో మందులు తీసుకుంటున్న రోగులు

భీమునిపట్నం: భీమిలి బీచ్ సమీపంలో వీరాంజనేయ అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఇటీవల శబరిమలైలో చనిపోయిన సీనియర్ సంఘ సభ్యుడు అడిదం సన్యాసిరాజులుకు సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు సుమారు 250 మంది రోగులను పరీక్షించి వారికి అవసరమైన మందులు అందించారు. సేవా సంఘ అధ్యక్షుడు కొమ్మినేని ఎర్రునాయుడు, ఉపాధ్యక్షుడు కదిరి జగన్నాథం, కార్యదర్శి మొకర నర్సింగరావు, కోశాధికారి పిల్లి శ్రీను, ముఖ్య సలహాదారులు గిగ్గిళ్ల సాయి ఇతర సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి అవమానంపై నిరసన


తాళ్లవలస ఎస్సీ కాలనీలో నిరసన వ్యక్తం చేస్తున్న అంబేడ్కర్ సంఘం నాయకులు

తగరపువలస: తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్ల గాంధీ కాలనీలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి జరిగిన అవమానానికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని తాళ్లవలస అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు బోని సన్నిబాబు డిమాండ్ చేశారు. తన అనుచరులతో కలిసి తాళ్లవలసలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. గుర్తు తెలియని దుండగులు అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన వారిని గుర్తించి, కఠినంగా శిక్షించాలన్నారు. నిరసన కార్యక్రమంలో బోని ప్రసాద్, శివ, హేమంత్, పోతిబారిక అప్పారావు, సిద్ధార్థ, రవ్వ పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో పలు సమస్యలకు చెక్

తగరపువలస: ఆనందపురం మండలం పెద్దిపాలెం యాక్టివ్ మూవ్‌మెంట్ ఫిజియోథెరపీ ఫిట్‌నెస్ అండ్ వెల్‌నెస్ హబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అంబేడ్కర్ కూడలిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సాయిలత మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఊబకాయం, ఫ్యాట్ ఉన్న వ్యక్తులతోపాటు మహిళల్లో వచ్చే సమస్యలకు ప్రత్యేకమైన థెరపీలు ఉన్నాయన్నారు.

కంటి ఆరోగ్యంపై అవగాహన

ఏయూక్యాంపస్: ప్రపంచ ఆప్టోమెట్రీ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం బీచ్ రోడ్డులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెంచూరియన్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు బీచ్ రోడ్డులోని కురుసుర మ్యూజియం వద్ద ఫ్లాష్‌మాబ్, లఘు నాటిక ప్రదర్శించారు. వర్సిటీ బోధన సిబ్బంది, విద్యార్థులు కంటి ఆరోగ్యంపై స్థానికులు, సందర్శకులకు అహగాహన కల్పించారు. కాటరాక్ట్, కంటి సమస్యలపై, గ్లుకోమా తదితర వ్యాధుల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఆప్టోమెట్రీ విభాగం డీన్ డాక్టర్ కె.విజయబాబు, విభాగాధిపతి ఎం.శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మజ్ఞానంతో మోక్ష మార్గం


ప్రవచిస్తున్న సద్గురు పవిత్ర

తగరపువలస: బ్రహ్మజ్ఞానంతోనే మోక్షం సిద్ధిస్తుందని సంత్ నిరంకారీ మిషన్ కాకినాడకు చెందిన సద్గురు పవిత్ర అన్నారు. ఆనందపురం మండలం బోని గ్రామంలో ఆదివారం జరిగిన సత్సంగంలో ఆమె మాట్లాడారు. ప్రతి మనిషి కొంత వరకు మాత్రమే మంచిగా ఉండగలుగుతాడన్నారు. జీవితాంతం మంచి మనిషిగా ఉండేందుకు ఎంతో సాధన అవసరమన్నారు. పరమాత్మను దర్శిస్తూ దైవగుణాలను ధారణ చేయాలన్నారు. కరుణ, దయ, సహనం వంటి సద్గుణాలను సహజంగా కలిగి ఉంటూ, వాటిని ప్రదర్శించాలన్నారు. అందరితో ప్రేమ పూర్వకంగా మెలగాలన్నారు. ఇతరులకు కూడా సుఖశాంతులు చేకూరాలనే పవిత్ర భావన మదిలో మెలగాలన్నారు. స్వయంగా జ్ఞాన ప్రకాశంలో జీవిస్తూ, సత్యమార్గం వైపు అడుగులు వేసేలా ఇతరులకు ప్రేరణ కలిగించాలన్నారు. దేహం ఉండగానే తన జీవితంతో పాటు అందరి జీవితాలను పరిమళింపచేయాలన్నారు. కార్యక్రమంలో భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, సర్పంచ్ బోని అప్పలకొండ, సన్యాసినాయుడు, నిరంకారీ మండల్ విశాఖ అధ్యక్షుడు ప్రేమ, సత్యనారాయణ రాజు, పార్వతమ్మ, శ్యామ్, రవితో పాటు ఉత్తరాంధ్ర నుంచి పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు కొండపేట రహదారికి మోక్షం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు కొండపేట రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. తాగునీటి పైప్‌లైన్ నిర్మాణం కారణంగా గతంలో తవ్వకానికి గురైన రోడ్డు ఎన్నికల కోడ్ కారణంగా మరమ్మతులు నిలిచిపోయాయి. దీంతో ఈ మార్గంలో గోతులు ఏర్పడి కొండపేట వాసుల రాకపోకలకు ఇబ్బంది కలిగేది. ఆదివారం ఈ మార్గంలో బీటీ రోడ్డు నిర్మాణానికి జీవీఎంసీ పనులు ప్రారంభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొండపేటకు చెందిన దళిత నాయకుడు తాటిపూడి అప్పలరాజు మాట్లాడుతూ రెండేళ్ల తరువాత కొండపేటకు బీటీ రోడ్డు నిర్మాణం జరుగుతోందన్నారు.

అమ్మ చారిటబుల్ ట్రస్ట్ అన్నదానం


పేదలకు అన్నదానం చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధి రామకృష్ణ

తగరపువలస: స్వాతంత్య్ర సమరయోధులు భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక ప్రధాన రహదారితోపాటు సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. గుంటూరుకు చెందిన అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జైహింద్ గ్రూప్, భగత్‌సింగ్ అభిమానులు, ఎం.వి.కె.నాగేశ్వరరావు అన్నదానానికి సహాయ సహకారాలు అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ తగరపువలస అధ్యక్షుడు జోగ రామకృష్ణ మాట్లాడుతూ రెండేళ్లుగా ప్రతి ఆదివారం గుంటూరుకు చెందిన స్వామి జ్ఞాన ప్రసన్నగిరి ఆశీస్సులతో అభాగ్యులకు అన్నదానం చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులకు నివాళులర్పించారు.

కార్మిక ద్రోహులకు శిక్ష తప్పదు


మాట్లాడుతున్న నాగోతు అప్పలరాజు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లులో 6,050 మంది కార్మికులకు ద్రోహం చేసిన మిల్లు యజమాని బజోరియా, కార్మిక సంఘాలకు న్యాయస్థానంలో శిక్ష తప్పదని మిల్లు లాకౌట్ బాధితుల కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు నాగోతు అప్పలరాజు అన్నారు. మిల్లు కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మిల్లు యాజమాన్యంతో 2019, 2020లో కార్మిక సంఘాలు చేసుకున్న ఒప్పందాలకు చట్టబద్ధత లేదన్నారు. దీనిపై హైకోర్టులో తాము వేసిన దావా కార్మికులకు అనుకూలంగా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మిల్లు మూత తరువాత కార్మికులకు నష్ట పరిహారంగా 18 నెలల వేతనం ఇవ్వాలని లేబర్ కోర్టు ఆదేశాలను ధిక్కరించి అప్పటి మంత్రులు గంటా శ్రీనివాసరావు హయాంలో ఐదున్నర నెలలకు ఒప్పుకోగా, ముత్తంశెట్టి శ్రీనివాసరావు హయాంలో 3 నెలల వేతనం మాత్రమే ఇచ్చారన్నారు. మిల్లుకు చెందిన 54 ఎకరాల ఆస్తులపై 2011 నుంచి హైకోర్టులో శాశ్వత ఇంజక్షన్ ఆర్డర్ విచారణలో ఉన్నప్పటికీ యజమాని బజోరియా.. లలిత్‌మోహన్ అనే బినామీతో అనకాపల్లి జిల్లాలోని ఎలమంచిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా ఆస్తులను విక్రయిస్తున్నారన్నారు. వీరి నిర్వాకంతో చిట్టివలసలో పరిశ్రమ మూతపడి కార్మికులు వలసలు పోయారన్నారు.

సంఘ ప్రధాన కార్యదర్శి జీరు వెంకటరమణ మాట్లాడుతూ యాజమాన్య ప్రతినిధులు కార్మికులను బెదిరించి క్వార్టర్స్ ఖాళీ చేయించారన్నారు. దేశంలో అన్ని పరిశ్రమలు కార్మికుల పీఎఫ్‌ను పీఎఫ్ కార్యాలయాలకు నేరుగా జమ చేస్తే చిట్టివలస యాజమాన్యం మాత్రం ట్రస్ట్ పేరుతో విజయనగరంలోని బ్యాంక్‌కు మళ్లించిందన్నారు. దీనివల్లో యాజమానికి 2 శాతం కమీషన్ వస్తోందని ఆరోపించారు. దీంతో చాలా మంది కార్మికులు నష్టపోయారన్నారు. సమావేశంలో కార్మిక నాయకుడు సింగిడి అప్పారావు, యరబాల తాతారావు, దామోదర బాబాజీ, దాసు, పాశల శివ, మాకాల శంకరరావు, దాలయ్యరెడ్డి, గిడుతూరి శ్రీనివాసరావు, సరగడ అప్పలరెడ్డి, జగన్నాథం తదితరులు మాట్లాడారు.

ఆదమరిస్తే అంతే సంగతి


మద్ది సమీపంలోని కాలువ వద్ద శిథిలమైన రక్షణ గోడ

పద్మనాభం: మండలంలోని మద్ది సమీపంలో ఉన్న పాండ్రంగి కాలువపై కల్వర్టు రక్షణ గోడ శిథిలమైంది. దీంతో ఏ క్షణం ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనన్న ఆందోళన నెలకొంది. విలాస్కాన్‌పాలెం రోడ్డులో మద్ది సమీపంలోని పాండ్రంగి సాగు నీటి కాలువై రోడ్డుకు అనుసంధానంగా గతంలో కల్వర్టు నిర్మించారు. ఈ కల్వర్టుకు ఒక వైపు గోడ కొంత శిథిలమైంది. ఈ రోడ్డుపై పద్మనాభం మండలం విలాస్కాన్‌పాలెం, మద్ది, విజయనగరం జిల్లా అన్నంరాజుపేట గ్రామాలకు లారీలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. వాహన చోదకులు ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా వాహనాలు కాలువలోకి పల్టీ కొట్టి, ప్రయాణీకుల ప్రాణాలు గాల్లో కలిసి పోయే ప్రమాదముంది. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి రక్షణ గోడను పునర్నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మానవ హక్కుల కోర్టులు ఏర్పాటు చేయాలి

అల్లిపురం: మానవ హక్కుల పరిరక్షణ చట్టం 1993, సెక్షన్ 30 ప్రకారం ప్రతి జిల్లాలో మానవ హక్కుల కోర్టులు ఏర్పాటు చేయాల్సి అలా జరగడం లేదని మానవ హక్కుల కౌన్సిల్ గౌరవాధ్యక్షుడు ఆచార్య వై.వై.సత్యనారాయణ అన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో దామోదర్ సంజీవయ్య జాతీయ లా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆదివారం మానవ హక్కుల కోర్టుల ఏర్పాటుపై జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సమ్మతితో ప్రతి జిల్లాలో ఒక సెషన్సు కోర్టును మానవ హక్కుల న్యాయస్థానంగా ఏర్పాటు చేసినా బాధితులకు సత్వర న్యాయం లభించడం లేదన్నారు. కాకినాడ జిల్లా మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులు హబీబ్ బాషా, గుండు అప్పలరాజు, వీఎస్ఎన్ మూర్తి, నక్కాని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అమర వీరులు.. త్యాగధనులు


మధురవాడలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు నివాళులర్పిస్తున్న నాయకులు


భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలతో కాగడాలు ప్రదర్శిస్తున్న సీపీఐ నాయకులు


భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు

మధురవాడ: అమరుల త్యాగాలు వృథా కానివ్వమని పలు ప్రజా సంఘాల నాయకులు ప్రతిజ్ఞ చేశారు. సీఐటీయూ, ఐద్వా, డీవైఎఫ్ఐ, బాలల సంఘం తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం మధురవాడలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులతోపాటు వార్వా, నివాస్ సంఘాల నాయకులు బొత్స నరసింహమూర్తి, గుర్రాల రఘురామ్ అమరుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు స్వాతంత్రోద్యమంలో బ్రిటిష్ సామ్రాజ్య వాదుల గుండెల్లో దడ పుట్టించిన గొప్ప వీరులన్నారు. దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన త్యాగధనులని పేర్కొన్నారు. అనంతరం ఇక్కడ పాదచారులు, ప్రజలకు చలివేంద్రం ద్వారా మజ్జిగ పంపిణీ చేశారు. సామ్రాజ్య వాదానికి వ్యతిరేఖంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు జి.కిరణ్, డి.కొండమ్మ, సిహెచ్.శేషుబాబు, ఎల్.పద్మ, బి.ఉష, డి.ఉమా, శైలు, మంగశ్రీ, మేఘన, డి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన

సర్దార్ భగత్‌సింగ్, రాజుగురు, సుఖదేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా మధురవాడలో సీపీఐ ఏరియా సమితి ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. వారి చిత్రపటాలతో కాగడాలు చేత పట్టుకుని యువత సమస్యలపై నినాదాలు చేశారు. దేశ స్వాతంత్య్రం కోసం చిన్న వయసులోనే ఉరికొయ్యలను ముద్దాడిన విప్లవ వీర కిషోరాలు వీరని కొనియాడారు. వీరి త్యాగనిరతిని దేశం ఎప్పటికీ మరిచిపోదని సీపీఐ ఏరియా సమితి నాయకుడు సత్యనారాయణ అన్నారు. ఈ ప్రదర్శన పార్టీ కార్యాలయం నుంచి బజారు మీదుగా వీధుల్లో సాగింది. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు దిలీప్‌కుమార్, తిరుపతిరావు, ప్రసాద్, దినేష్, అర్జున్, తానీస, మురళి తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ పోరాటం స్ఫూర్తిదాయకం

తగరపువలస: స్థానిక గుజ్జు రామునాయుడు భవన్‌లో ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు నివాళులర్పించారు. భగత్‌సింగ్ 23 ఏళ్లే బతికినప్పటికీ దేశ స్వాతంత్య్రం కోసం చేసిన పోరాటాలు, బ్రిటీష్‌వారిపై తిరుగుబాటు ప్రజల్లో స్ఫూర్తిని రగిలించాయని నాయకులు గుర్తు చేశారు. కార్యక్రమంలో కొండపు ఈశ్వరరావు, సుంకర రాంప్రసాద్, కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, చిల్ల రాంపైడి, నూలు ఆదినారాయణ, సన్నిబాబు, లక్ష్మణరావు, చంద్రరావు, అప్పారావు, తోటయ్య, సత్యారావు తదితరులు పాల్గొని రెడ్ సెల్యూట్ చేశారు.

దేశాభివృద్ధిలో కళాకారుల పాత్ర కీలకం

తాటిచెట్లపాలెం: దేశాభివృద్ధి, సమాజాభివృద్ధిలో కూడా కళాకారులది సుస్థిర స్థానమని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రతబాగ్చి తెలిపారు. ఆదివారం రైల్వేన్యూకాలనీలో గల సుబ్బలక్ష్మీ కల్యాణ మండపంలో విశాఖ కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కళాప్రవీణ 2025 ఉగాది పురస్కారాల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులు అనేక రూపాల్లో ప్రజలకు వినోదం కలిగించడంతో పాటు ప్రభుత్వాలు చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలపై కూడా అవగాహన కల్పిస్తున్నారన్నారు. కళాకారుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లడుతూ గత కొన్నేళ్లగా పలువురు కళాకారులకు ప్రతి ఏటా ఉగాది పర్వదినాన అవార్డులు ప్రదానం చేస్తున్నామన్నారు.

రాత్రికి రాత్రే కబ్జా..!


జగనన్న కాలనీని ఆనుకుని ప్రభుత్వ స్థలంలో చేసిన మార్కింగ్

తగరపువలస: ఆనందపురం మండలంలో కబ్జాదారులు రాత్రికి రాత్రే ప్రభుత్వ స్థలాలను ఆక్రమించేస్తున్నారు. రెవెన్యూ సిబ్బందిని మచ్చిక చేసుకుని అటువైపుగా రాకుండా చూసుకుంటున్నారు. ఇందుకు గాను కనీసం రూ.50 వేల నుంచి నజరానాలు ముట్టచెబుతున్నారు. వేములవలస మార్కెట్‌కు సమీపంలోని ఆనందపురం పంచాయతీకి చెందిన జగనన్న కాలనీని ఆనుకుని సర్వే నంబర్ 276లో శనివారం రాత్రి ఏపీఈపీడీసీఎల్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తించే శంకర్ అనే వ్యక్తి సుమారు 160 గజాల స్థలం ఆక్రమణకు శ్రీకారం చుట్టాడు. ఆగమేఘాల మీద 9 పిల్లర్లు నిర్మించేలా ఇంజినీర్‌తో మార్కింగ్ చేయించాడు. ఆదివారం రాత్రి పొక్లెయిన్‌తో గోతులు తవ్వేలా ఒప్పందం చేసుకున్నారు. వారం రోజుల తరువాత ఇంటి నిర్మాణానికి వెళ్లనున్నారు. ఈలోగా స్థానికులకు విషయం తెలియడంతో రెవెన్యూ సిబ్బందికి సమాచారం ఇవ్వగా.. ఆదివారం సెలవని సోమవారం గుర్తు చేయాలని ఫోన్ పెట్టేశారు. దీంతో లాభం లేదని స్థానికులు వీఆర్వోకు ఫిర్యాదు చేశారు. సోమవారం తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వ భూమి కబ్జాకు గురి కాకుండా వినతిపత్రం ఇవ్వనున్నట్టు పంచాయతీ వాసులు తెలిపారు.

సర్వీస్‌రోడ్డుపై వ్యాపారాలతో ట్రాఫిక్ ఇక్కట్లు


వేములవలస సర్వీస్ రోడ్డుకు ఇరువైపులా చేపల విక్రయాలు

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస సర్వీస్ రోడ్డుకు ఇరువైపులా చేపల విక్రయాల కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. తగరపువలస నుంచి వేములవలస మీదుగా విశాఖ వైపు వెళ్లే వాహనాలకు ఇక్కడ కూడలిలో తరచూ అంతరాయం కలుగుతోంది. చేపల కొనుగోలుకు వచ్చే వినియోగదారులు రహదారిపైనే తమ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. పంచాయతీ పాలక వర్గం చేపల మార్కెట్‌కు ప్రత్యేకంగా స్థలం కేటాయించడంతో పాటు, ట్రాఫిక్ పోలీసులు సర్వీస్‌రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూడాలని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.